
సాక్షి
సంగారెడ్డి
గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



ఈ శోకానికి బాధ్యులెవరు?

అజాగ్రత్త, అతివేగం, నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి అనేకమంది ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

వివరాలు 8లో ▸



వరద నీటిలో పరిశ్రమలు

గడ్డపోతారం పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలు వర్షపు నీటిలో మునుగుతున్నాయి.

వివరాలు 9లో ▸

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం మొగుడంపల్లి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని మన్నాపూర్ ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ తెలిపారు. దీంతో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉండదని విజ్ఞప్తి చేశారు.

న్యూస్‌రీల్

వేలిముద్రలు నమోదు చేసుకోవాలి

సంగారెడ్డి టౌన్: రేషన్ కార్డులో పేర్లు ప్రతి ఒక్కరూ వారి వేలిముద్రలను షాపు ల్లోని ఈ పాస్ యంత్రం ద్వారా ధ్రువీకరించుకోవాలని అదనపు కలెక్టర్ మాధురి బుధవారం సూచించారు. రేషన్ పంపిణీ పూర్తయిన తర్వాత కూడా దుకాణాలు తెరిచి ఉంటాయని పేర్కొన్నారు. ఆ మేరకు రేషన్ దుకాణదారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



నాయకులకు కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

రాయికోడ్(అందోల్): సంక్షేమ పథకాలు లబ్ధిదారులు అందేలా చేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. రాయిపల్లి, నాగ్వార్, బొగ్గులంపల్లి గ్రామాలకు చెందిన పలువురు ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఇందూర్ గ్రామ సమీపంలోని ఆశ్రమాన్ని దర్శించుకోగా ఆశ్రమాధిపతి చెల్లమల్లికార్జున స్వామి ఆశీస్సులు పొందారు. ఇటికేపల్లిలో రూ.20 లక్షల నిధులతో నిర్మించే హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున్‌పాటిల్, పార్టీ మండల అధ్యక్షుడు బసవరాజ్‌పాటిల్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్ధప్ప పాటిల్, నాయకులు విఠల్, తుకారం, శంకర్,లక్ష్మణ్, అడివయ్య, మల్లు పాటిల్, బస్వరాజ్ పాటిల్, మాణిక్యం, తదితరులు ఉన్నారు.

ఎర్థనూర్ గుట్టల్లో చిరుత సంచారం!

కంది(సంగారెడ్డి): మండలపరిధిలో చిరుత సంచరిస్తున్నట్లు పుకార్లు వ్యాపించాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం సాయంత్రం ఎర్థనూర్ బ్యాతోల్ శివారులో కంకర క్రషర్‌లో పని చేసే ఓ కార్మికుడు కాలకృత్యాలు తీర్చుకునేందుకు గుట్టలవైపు వెళ్లాడు. అక్కడ అతడికి చిరుత కనిపించడంతో భయంతో పరుగు తీసి, తోటి కార్మికులతోపాటు గ్రామస్తులకు ఈ విషయమై తెలిపాడు. గుట్టల పక్కనే ఉన్న బ్యాతోల్ తండా, ఎర్థనూర్ తండా, ఎర్థనూర్ గ్రామస్తులకూ తెలిసింది. దీంతో వీరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు బంధించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం గ్రామపంచాయతీ పరిధిలో అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్‌ను ఈఓ నరేశ్ ఆధ్వర్యంలో బుధవారం జేసీబీ సాయంతో అధికారులు కూల్చివేశారు. రెండేళ్ల క్రితం నిర్మించగా ఇప్పుడు కూల్చివేయటం ఏంటని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి నిర్మాణాలు లేకున్నా ఇంటి నంబర్లను కూడా అధికారులు కేటాయించారని, పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశమై పలు అవకతవకలు జరిగి నట్లు ఆరోపిస్తూ నేతలు డీపీఓకు ఫిర్యాదు చేశారు.

డీఎల్‌పీఓ విచారణ

గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని 72, 80, 84, 85, 89 సర్వే నంబర్‌గల భూమిలో ఇంటి నంబర్లు కేటాయించారనే ఆరోపణలపై డీఎల్‌పీఓ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈఓ నరేశ్‌బాబు, ఇతర సిబ్బందితో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి స్థాయి విచారణ చేపట్టిన తర్వాత అక్రమాలకు ఎవరు పాల్పడిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

'ఎన్నికల్లో గౌడ సంఘానిది కీలక పాత్ర'

సదాశివపేట(సంగారెడ్డి): త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర గౌడ సంఘం అత్యంత కీలకం కానుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటేల్ వెంకటేశం గౌడ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో జరిగిన సంఘం సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, త్వరలో జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో పర్యటించి సంఘం పెద్దలను, యువకులను కలసి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని వెల్లడించారు. గౌడ కులస్తులు ఐకమత్యంతో ఉండాలని, సమస్యల పరిష్కారానికి కలసి పోరాడాలని పిలుపునిచ్చారు.

జిల్లా కమిటీ ఇదే

సంగారెడ్డి జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడిగా బుదేరా పెద్దాగౌడ్, ప్రధాన కార్యదర్శి బండల వెంకటేశంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడిగా పోగుల జగన్‌గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.





సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

గోదావరి గలగలలు.. ప్రగతి పరుగులు

గౌరవెల్లి ప్రాజెక్టుతో మరో కోనసీమ

- మిడ్‌మానేరు ద్వారా గోదావరి నీళ్లు తెచ్చిన ఘనత కేసీఆర్‌దే
- రూ.7,752 కోట్లతో హుస్నాబాద్ అభివృద్ధి చేశాం
- బీజేపీ, కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు
- ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

హుస్నాబాద్: మిడ్‌మానేరు ద్వారా హుస్నాబాద్ నియోజకవర్గానికి గోదావరి నీళ్లు తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పట్టణంలో గురువారం రూ.19 కోట్లతో నిర్మించిన ఐఓసీ భవనం ప్రారంభం, రూ.2.80కోట్లతో నిర్మించనున్న ఏసీపీ కార్యాలయ భవన నిర్మాణానికి, అలాగే రూ.20లక్షల వ్యయంతో నిర్మించే టీఎస్‌జీఓ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పోతారం(ఎస్)లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సభలో మంత్రి మాట్లాడారు. గతంలో డివిజన్ కార్యాలయాల కోసం కరీంనగర్‌కు వెళ్లేవారని, ప్రస్తుతం అన్ని డివిజన్ కార్యాలయాలను ఒకే చోట నిర్మించుకోవడం ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఘనత అని అన్నారు. గత తొమ్మిదేళ్ల కాలంలో నియోజకవర్గంలో రూ.7,752 కోట్లతో అభివృద్ధి చేపట్టామన్నారు. గిరిజన తండాలకు రోడ్లు, తాగునీరు, సాగునీరు, సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసుకొని రైతులకు ఉచితంగా కరెంట్‌ను అందిస్తున్నామని తెలిపారు.

కోనసీమగా హుస్నాబాద్..

గౌరవెల్లి ప్రాజెక్టును కాంగ్రెస్ హయాంలో పట్టించుకోలేదని ప్రత్యేక రాష్ట్రంలో రూ.2500 కోట్లు వెచ్చించి పూర్తి చేశామన్నారు. ఇక మిగిలింది పిల్ల కాలువలు, పొలాల కాలువల తవ్వకాలే ఉన్నాయని తెలిపారు. రెండు పంటలకు నిలయంగా మారి, మరో కోనసీమగా మారబోతుందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి కాకుండా కాంగ్రెస్, బీజేపీలు కోర్టులో కేసులు వేశారని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేశామన్నారు.

బండి సంజయ్‌వి మాటలే..

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఈ ప్రాంతానికి కేంద్రం నుంచి నయా పైసా తేలేదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. వారాల గురించి మాట్లాడటమే తప్ప వరాలు తీసుకురాలేదని, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. బరువు, బాధ్యత లేని బీజేపీ, కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు.

ఇంటి ఎదుట అభివృద్ధి..

ఎమ్మెల్యే సతీష్‌కుమార్ నిజాయితీ పరుడని, ఇంకా అభివృద్ధి జరగాలంటే తనని గెలిపించాలని మంత్రి అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఇంటి ముందు అభివృద్ధి, కంటి ముందు అభ్యర్థిని చూసి మూడో సారి గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. త్వరలోనే సీఎం కేసీఆర్‌చే గౌరవెల్లి ప్రాజెక్టును ప్రారంభిస్తామని వెల్లడించారు.

బీజేపీ ఎంపీల అసమర్థతే కారణం..

బీజేపీ ఎంపీల అసమర్థత వల్లనే మన రాష్ట్రానికి విద్యాలయాలు రావడం లేదని రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలోనే గజ్వేల్‌కు రైల్వేలైన్‌కు శంకుస్థాపన చేశామని, ప్రస్తుతం సిద్దిపేటకు ట్రయల్ రన్ జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టుతో హుస్నాబాద్ నియోజకవర్గం సస్యశ్యామలం కాబోతోందని, 1.06లక్షల ఎకరాలకు నీటిని అందించబోతున్నామని తెలిపారు. కార్యక్రమాల్లో సీపీ శ్వేత, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్సీ బండ ప్రకాష్, సిద్దిపేట జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ, హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ రెడ్డి, సిద్దిపేట జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చింతన్న.. నేనున్నా..



చింతా ప్రభాకర్ ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న మంత్రి కేటీఆర్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కొండాపూర్ మండలం గుంతపల్లిలో బుధవారం జరిగిన మోనిన్ పరిశ్రమ శంకుస్థాపన కార్యక్రమంలో ఆసక్తికరమైన సన్నివేశం చోటు చేసుకుంది. చింతా ప్రభాకర్ భుజం తట్టి ఆరోగ్యం గురించి మంత్రి కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. 'చింతన్న నీకు నేనున్నా' అంటూ భరోసా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులంతా సంగారెడ్డి అభ్యర్థి అయిన ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పూర్తి స్థాయిలో కోలుకొని నిత్యం ప్రజల మధ్య ఉంటూ అంకితభావంతో సేవ చేస్తున్నారని అభినందించారు. జనానికి అందుబాటులో ఉండే నాయకులకే సీఎం, అభ్యర్థిత్వాలు ప్రకటించారని పేర్కొన్నారు.

రూ.300 కోట్లతో పరిశ్రమ



భూమి పూజ చేస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో కంపెనీ చైర్మన్ ఒలివర్ మోనిన్, జయేశ్ రంజన్, చింతా ప్రభాకర్

- 350 మందికి ఉపాధి
- ఐటీ శాఖ మంత్రి కేటీఆర్

కొండాపూర్(సంగారెడ్డి): 300 కోట్ల రూపాయలతో మోనిన్ పరిశ్రమ ఏర్పాటవుతోందని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. మండలంలోని గుంతపల్లిలో ఫ్యాక్టరీకి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యక్షంగా 150 మందికి, పరోక్షంగా 200 మందికి ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. పరిశ్రమల ఏర్పాటులో స్థానికంగా ఏదైనా సమస్యలు వస్తే ఇక్కడి ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా పరిష్కరించాలని సూచించారు. అలా చేస్తేనే మన మండలానికి మరిన్ని వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, సర్పంచ్ పడమటి సుమిత్ర, ఎంపీటీసీ రాందాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్, నాయకులు పాండురంగం, రఘునాథ్ రెడ్డి, రుక్మోద్దిన్, మల్లాగౌడ్, ప్రకాశ్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- కేంద్ర మాజీ మంత్రి దీపదాస్ మున్షి
- హైదరాబాద్‌లోనే సీడబ్ల్యూసీ సమావేశాలు ఉంటాయని వెల్లడి



మాట్లాడుతున్న దీపదాస్ మున్షి

జహీరాబాద్: రాష్ట్రంలోని ప్రజలు కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని, దీన్ని ఎవరూ ఆపలేరని కేంద్ర మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యురాలు దీపదాస్ మున్షి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో పార్టీ చీఫ్ కోఆర్డినేటర్ ఎ.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు పూర్తిగా మర్చిపోయారని విమర్శించారు. ఒక్క కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యపడుతుందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి సాగిస్తున్న అరాచక పాలనకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందన్నారు. నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీకి భారీ మెజార్టీని సాధించి పెట్టాలన్నారు. జహీరాబాద్ అనాదిగా పార్టీకి కంచుకోటగా ఉంటూ వస్తోందన్నారు. ఇది మరోమారు రుజువు చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ యువకుల ఆత్మ బలిదానాలతో చలించిపోయిన సోనియా గాంధీ అప్పట్లో ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. బీఆర్ఎస్ అధినేత మాత్రం కుటుంబ పాలన సాగిస్తూ నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈనెల 15, 16వ తేదీల్లో సీడబ్ల్యూసీ సమావేశాలు హైదరాబాద్‌లో జరుగుతున్నాయని స్పష్టం చేశారు. 17న తుక్కుగూడలో నిర్వహించనున్న బహిరంగ సభకు సోనియా, రాహుల్, మల్లికార్జున ఖర్గే హాజరవుతున్నారన్నారు. సభకు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు. సమావేశంలో పార్లమెంట్ ఇన్‌చార్జి మయప్పన్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, ఎంపీపీలు ఎస్.గిరిధర్‌రెడ్డి, మాధవి, దేవిదాస్, జెడ్పీటీసీలు రాందాస్, నాగిశెట్టి, మండల పార్టీ అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి, రామలింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కండెం నర్సింహులు, మక్సూద్, భాస్కర్‌రెడ్డి, గుండ్‌రెడ్డి, షౌకత్, బొల్లు కిషన్, మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ

పార్టీ నియోజకవర్గ ముఖ్య సమన్వయ కర్త చంద్రశేఖర్



మాట్లాడుతున్న చంద్రశేఖర్

జహీరాబాద్: వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని పార్టీ నియోజకవర్గ ముఖ్య సమన్వయ కర్త ఎ.చంద్రశేఖర్ అన్నారు. చెరకు రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. బుధవారం పట్టణానికి వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరిస్తోందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తమ సర్కారు రాగానే రైతులతో కలిసి కర్మాగారాన్ని నడిపించుకుంటామన్నారు. కేసీఆర్ రైతులకు ఉచితంగా ఎరువులు అందిస్తామని అధికారంలోకి వచ్చారని, తర్వాత వారి ఉసురు తీస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్‌ను అందించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. దివంగత మాజీ సీఎం వైఎస్సార్ ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం చేశాడని, రుణమాఫీ చేశారని గుర్తుచేశారు. తెలంగాణ కోసం అందరూ కష్టపడ్డారని, ప్రస్తుతం ఒక కుటుంబం మాత్రమే రాజ్యమేలుతోందని విమర్శించారు. నిరుద్యోగ భృతి ఇస్తామని, ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ఉద్యోగాలు రాక నిరుద్యోగులు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి మాజీ మంత్రి జె.గీతారెడ్డి ఎంతో పాటుపడ్డారన్నారు. సమావేశంలో ఎంపీపీ అధ్యక్షుడు ఎస్.గిరిధర్‌రెడ్డి, మాధవి, జెడ్పీటీసీ నాగిశెట్టి రాథోడ్, బీఆర్ఎస్ నాయకులు రామలింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మక్సూద్, గుండ్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్డారంలో విషాదం

- ఎదురెదురుగా ట్రాక్టర్, బైక్ ఢీ, ఇద్దరి మృతి
- మృతులు స్థానికులే



ఖాజా



ఆంజనేయులు

పటాన్‌చెరు టౌన్: మండలంలోని లక్డారం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం... గ్రామ రహదారి నుంచి జాతీయ రహదారి వైపు బుధవారం రాత్రి ట్రాక్టర్ వస్తోంది. అదే సమయంలో గ్రామస్తులైన ఆంజనేయులు(32), ఖాజా(38) బైక్‌పై ఊరు లోపలకు వెళ్తున్నారు. దీంతో ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వీరిద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తాళాలు పగలగొట్టడం తగునా?

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు)/జహీరాబాద్ టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తుంటే జహీరాబాద్, కంది, పటాన్‌చెరు ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడం ఏమిటని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కే.రాజయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధ్యులపై వెంటనే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు ప్రమాద బీమా రూ.20 లక్షలు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. వీరికి పని భారం తగ్గించాలని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, నాగేశ్వరావు పాల్గొన్నారు. జహీరాబాద్‌లో... సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మె బుధవారం అంగన్‌వాడీలు చెవిలో పూలు పెట్టుకుని వినూత్నరీతిలో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ప్రసంగించారు. కార్యక్రమంలో అనూరాధ, సబిత, షాహెదా, వసీమా, బాలమని, మల్లమ్మ పాల్గొన్నారు.

తాళం పగలగొట్టి..



తాళం పగలగొడుతున్న అధికారులు

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం గది తాళాలు పగలగొట్టి ఎంపీడీవో జగదీశ్వర్, ఎంపీఓయూ సుబ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో తెరిచారు. అందులోని గుడ్లు, పౌష్టికాహారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల సెంటర్లను తెరిపించి బాలింతలు, గర్భిణులకు చిన్నపిల్లలకు అందాల్సిన పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తామన్నారు.

విగ్రహాల తయారీతో జీవనోపాధి

- రాజస్థాన్ నుంచి వచ్చిన 12 మంది కళాకారులు
- పట్టణంతోపాటు ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు

సంగారెడ్డి టౌన్: గణేశుడి ఉత్సవాలు దగ్గర పడుతున్న కొద్దీ విగ్రహాల తయారీ ఊపందుకుంటోంది. రాజస్థాన్ నుంచి 12 మంది తయారీదారులు పట్టణానికి వచ్చి విగ్రహాలను తయారు చేస్తున్నారు. సిద్ధమైన తర్వాత రంగులను అద్ది తీర్చిదిద్దుతున్నారు. అనంతరం పట్టణం నుంచి జహీరాబాద్, జోగిపేట్, నారాయణఖేడ్, షాపూర్‌లకు తరలించి విక్రయిస్తున్నారు. రోజుకు మీడియం సైజు 15 నుంచి 20 వరకు, పెద్దవి అయితే 10 నుంచి 15 వరకు సిద్ధం చేయగలరు. వీటి ధరలు రూ.5 వేల నుంచి 50వేల వరకు ఉంటాయని పేర్కొన్నారు. విగ్రహం అడుగు నుంచి 25 అడుగుల ఎత్తు వరకు సిద్ధం చేస్తున్నారు. మీడియం కావాలంటే వెంటనే లభిస్తున్నాయి. అదే పెద్ద సైజువి కావాలంటే ముందస్తుగా మండప నిర్వాహకులు ఆర్డర్లు ఇవ్వాల్సి ఉంటుందని చెబుతున్నారు. వీరి అభిరుచికి అనుగుణంగా తయారు చేసి సరఫరా చేస్తున్నారు. గతంతో పోలిస్తే ముడి సరుకు ధరలు పెరిగాయని, దీంతోపాటు విగ్రహ ధరలు పెరిగే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.



రంగులు దిద్దుతున్న కళాకారుడు

కుటుంబమంతా ఇదే పని



మాది రాజస్థాన్. ఎన్నో ఏళ్లుగా ఇక్కడికే వస్తూ విగ్రహాలు తయారు చేస్తున్నాం. పండగల సమయంలో మా కుటుంబమంతా శ్రమిస్తోంది. వివిధ రంగురంగుల్లో ఆకర్షణీయంగా తయారు చేస్తున్నాం. 250 నుంచి 350 విగ్రహాలు తయారు చేస్తాం.

–విజయ్ విగ్రహ తయారీదారుడు, రాజస్థాన్

ముడిసరుకు ధరలు పెరిగాయి



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పెద్ద సైజు విగ్రహాలను వినియోగదారులు ఎక్కువగా అడుగుతున్నారు. ముడి సరుకు ధరలు పెరిగాయి. దీంతో ప్రతిమ రేటు కూడా పెరుగనుంది. మండప నిర్వాహకులు ఆర్డర్లు చేసినవి తీసుకొని వెళ్తున్నారు.

–సునీల్, కళాకారుడు, రాజస్థాన్

క్లుప్తంగా

హత్యా యత్నం కేసులో భర్తకు జైలు

సిద్దిపేటరూరల్: భార్యను హత్య చేసేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తికి కోర్టు జైలుశిక్షతో పాటు జరిమానా విధించింది. రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై కిరణ్ రెడ్డి తెలిపిన వివరాలు. మండల పరిధిలోని చిన్నగుండవెల్లి గ్రామానికి చెందిన మస్కూరి మల్లేశం మద్యంకు బానిసై భార్య భాగ్యను డబ్బుల కోసం వేధించేవాడు. పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టినా అతని తీరులో మార్పు రాలేదు. 2019లో మద్యం మత్తులో డబ్బులు ఇవ్వాలని భార్య మెడకు చీర కొంగు బిగించి కత్తితో పొడిచే ప్రయత్నం చేశాడు. భర్తతో ప్రాణహాని ఉందని అప్పటి ఎస్ఐ కోటేశ్వరరావుకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మల్లేశంను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. కేసు విచారణ అనంతరం జిల్లా అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి స్వాతిరెడ్డి బుధవారం తీర్పు ఇచ్చారు. నేరం రుజువు కావడంతో మల్లేశంకు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించారు.

రుతు ప్రేమకు స్పందన



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

సిద్దిపేటజోన్: సిద్దిపేటలో చేపట్టిన రుతుప్రేమ గురించి పత్రికల్లో, టీవీల్లో చూసి తెలుసుకున్నానని, ప్రస్తుతం జిల్లా అధికారిగా ప్రత్యక్ష స్పందన చూస్తున్నానని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక 14, 42వ వార్డుల్లో రుతుప్రేమపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రుతుప్రేమ గురించి ప్రత్యేక యాప్‌లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, డాక్టర్ శాంతి, కౌన్సిలర్ కవిత, బీఆర్ఎస్ నాయకులు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు, నిందితుడు

కల్హేర్(నారాయణఖేడ్)/నారాయణఖేడ్: హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్‌కు కారులో తరలిస్తున్న 80కిలోల ఎండు గంజాయిని జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నట్లు ఖేడ్ ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా అబ్కారీశాఖ టాస్క్‌ఫోర్స్ సీఐ శంకర్, ఎస్ఐ పృథ్వీ సిబ్బందితో కలిసి కల్హేర్ మండలం మాసాన్‌పల్లి సమీపంలో సంగారెడ్డి-నాందేడ్ 161 జాతీయ రహదారి పక్కన ఉన్న బంజారా దాబా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. హైదరాబాద్ నుంచి పిట్లం వైపు వెళ్తున్న షిఫ్ట్ డిజైర్ కారును ఆపి తనిఖీ చేయగా 80కిలోల గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. కారులో ఉన్న నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం ఘుస్‌పూర్‌కు చెందిన కాత్రావత్ రమేష్‌ను అరెస్టు చేశారు. గంజాయి, కారు, సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భూకబ్జా ఘటనలో కేసు నమోదు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామ శివారులో భూ కబ్జా ఆరోపణలకు సంబంధించి పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మధుసూదన్‌గౌడ్ తెలిపారు. బొగ్గుల జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, వృంద వెంచర్ నిర్వాహకులు విష్ణు, ప్రసాద్, సునీల్‌రావులపై కేసు నమోదు చేశామన్నారు.

ఈ శోకానికి బాధ్యులెవరు..?

రహదారులు.. మృత్యుదారులు

- హైవేలపై ఎక్కడిక్కక్కడ భారీ వాహనాల పార్కింగ్
- వెనుక నుంచి వాహనాలు ఢీకొని ప్రమాదాలు
- అనేక మంది మృత్యువాత

రోడ్డు ప్రమాద వివరాలు..

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2020	602	272	726
2021	516	282	796
2022	283	189	373
2023 జనవరి నుంచి ఇప్పటివరకు	275	165	280

సిద్దిపేటకమాన్: అజాగ్రత్త, అతివేగం, నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి అనేకమంది ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. రహదారులపై ఎలాంటి సూచికలు లేకుండా భారీ వాహనాలు నిలపడం, నిబంధనలు పాటించకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, నిద్రమత్తు, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వలన సిద్దిపేట జిల్లాలోని రాజీవ్ రహదారిపై అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రెండు రోజుల క్రితం సిద్దిపేట జిల్లా అనంతసాగర్ వద్ద జాతీయ రహదారిపై నిలిపిన ఇసుక లారీని పరీక్ష రాసి తిరిగి వస్తున్న బీటెక్ విద్యార్థులు ప్రయాణిస్తున్న క్వాలీస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపడంతో పాటు జిల్లాలో కలకలం రేపింది.

275 రోడ్డు ప్రమాదాలు.. 165 మంది మృతి

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలోని పోలీసు కమిషనరేట్ పరిధిలో 275 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 165 మంది మృతి చెందగా, మరో 280 మంది గాయపడ్డారు. నాలుగేళ్లలో జిల్లాలో 1,676 రోడ్డు ప్రమాదాలు జరుగగా, వీటిలో సుమారు 908 మంది మృతి చెందారు. మరో 2,175 మందికి గాయాలయ్యాయి.



అనంతసాగర్ వద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యుల రోదన

రోడ్డుపై వాహనాలు పార్క్ చేయొద్దు

రాజీవ్ రహదారిపై భారీ వాహనాలు నిలపకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. రాత్రి సమయంలో రోడ్డుపై వాహనాలను ఆపడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అతివేగంగా వాహనాలను నడిపే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలి.

– ప్రసాద్, వాహనదారుడు

నిబంధనలు పాటించాలి

వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబధనలు పాటించి డ్రైవింగ్ చేయాలి. మైనర్లు వాహనాలు నడపకూడదు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం.

– ప్రసన్నకుమార్, ట్రాఫిక్ ఏసీపీ



రాజీవ్ రహదారిపై అడ్డగోలుగా నిలిపిన ఇసుక లారీలు

రాజీవ్ రహదారిపై భారీ వాహనాల పార్కింగ్

సిద్దిపేట జిల్లాలోని రాజీవ్ రహదారిపై ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇందులో ఉదయం నడపడానికి అనుమతి లేని భారీ గూడ్స్ వాహనాలను రాత్రి వేళ నడపుతుంటారు. దీంతో డ్రైవర్లకు నిద్ర సమస్య తలెత్తుతుంది. పగలంతా డ్రైవర్లు సేద తీరడానికి రాజీవ్ రహదారిపై ఎలాంటి సూచికలు లేకుండా, నిర్లక్ష్యంగా భారీ వాహనాలను నిలుపుతున్నారు. దీంతో అతివేగంగా వచ్చే వాహనాలు మూల మలుపుల వద్ద రోడ్డుపై నిలిపిన భారీ వాహనాలను గుర్తించలేక ఢీకొడుతున్నారు. ఇలా జరిగే ప్రమాదంలో చాలామంది మృత్యువాత పడటంతోపాటు పలువురు తీవ్ర గాయాల పాలవుతున్నారు. ఈ ప్రమాదాల కారణంగా అనేక కుటుంబాల్లో తీరని శోకం మిగులుతుంది. అంతేకాకుండా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మద్యం తాగి వాహనాలు నడపడం, మైనర్లు వాహనాలు నడపడం, అతివేగంతో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. జిల్లాలో రోడ్డు ప్రమాద నివారణకు సీపీ శ్వేత ఆధ్వర్యంలో పోలీసు, ట్రాఫిక్ అధికారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ వాహనదారుల్లో మార్పు రావడం లేదు. అదేవిధంగా పాఠశాలలు, కళాశాలల్లో సైతం విద్యార్థులకు వీటిపై వివరిస్తున్నారు.

ఇద్దరితో స్నేహంగా ఉండటంతో గొడవ

విద్యార్థిని కోసం గోమారం పాలిటెక్నిక్ కాలేజీలో కొట్టుకున్న విద్యార్థులు



కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): ఓ విద్యార్థిని కోసం వేర్వేరు కాలేజీల విద్యార్థులు ఘర్షణ పడిన సంఘటన మండల పరిధి గోమారంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గోమారం పాలిటెక్నిక్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థినికి వేరే కాలేజీ విద్యార్థితో పరిచయం ఉంది. అంతే కాకుండా తను చదువుతున్న కాలేజీలోని క్లాస్‌మేట్‌తోనూ స్నేహంగా ఉంటుంది. ఈ విషయం తెలిసి మంగళవారం విద్యార్థిని స్నేహితులు గొడవ పడ్డారు. రెండు కాలేజీల విద్యార్థులు ఇందులో తలదూర్చి పాలిటెక్నిక్ కాలేజీలో దాడులు చేసుకున్నారు. పోలీసులు అక్కడకు చేరుకొని విద్యార్థులను చెదరగొట్టారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థిని తల్లిదండ్రులను కాలేజీకి పిలిచి గొడవ గురించి తెలియజేసినట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ సుమలత తెలిపారు. అమ్మాయికి టీసీ ఇచ్చి పంపిస్తామని చెప్పారు.

కారుకు నిప్పు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధి ధర్మారం గ్రామానికి చెందిన కరికె కనకయ్య తన ఇంటి ఎదుట రోజు మాదిరిగా కారు పార్క్ చేసి ఉంచాడు. గుర్తు తెలియని దుండగులు బుధవారం తెల్లవారుజామున కారుపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. కుటుంబ సభ్యులు గ్రహించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కనకయ్య కుటుంబానికి, గ్రామానికి చెందిన కొందరితో ఇంటి స్థలం విషయంలో గొడవ జరుగుతుంది. ఆ పగతో కారుకు నిప్పు పెట్టి ఉండవచ్చని భావిస్తున్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

టీ తాగేందుకు వెళ్లి.. హత్యకు గురై..

- పాశవికంగా గొంతు కోసి వ్యక్తిని చంపిన దుండగులు
- ఇస్నాపూర్ శివారులో ఘటన



నదీమ్ తాహెర్

పటాన్‌చెరు టౌన్: టీ తాగేందుకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. నిర్మల్ జిల్లా బైంసా పట్టణానికి చెందిన అబ్దుల్ నదీమ్ తాహెర్ (28) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. అతనికి 10 నెలల క్రితం వివాహమైంది. ఈనెల 12న(మంగళవారం) హైదరాబాద్ టోలీచౌకిలో ఉండే సోదరి ఇంటికి సోదరుడు అబ్దుల్ అజీమ్‌తో కలిసి అబ్దుల్ నదీమ్ తాహెర్ వచ్చాడు. అదేరోజు సాయంత్రం స్నేహితుడితో కలిసి టీ తాగేందుకు బయటకు వెళ్తున్నానని చెప్పి బైక్‌పై వెళ్లాడు. రాత్రి కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా సంగారెడ్డి జంజం దాబాలో భోజనం చేస్తున్నానని చెప్పాడు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ కాల్ చేయగా ఫోన్ స్విచ్ఆఫ్ వచ్చింది. అనంతరం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ శివారు జాతీయ రహదారి పక్కన ఎవరో గుర్తుతెలియని దుండగులు నదీమ్‌ను గొంతుకోసి హత్య చేశారని కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. అయితే మృతుడు రియల్ ఎస్టేట్ వ్యాపారి కావడంతో ఆ నేపథ్యంలో హత్య జరిగిందా.. లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని పోలీసులు వివిధ కోణాల్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్య జరిగిన ప్రాంతంలో పటాన్‌చెరు సీఐ లాలూనాయక్, క్లూస్ టీం వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య ఎనిమిది నెలల గర్భిణి అని కుటుంబ సభ్యులు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సమ్మెలో మాట్లాడుతున్న పద్మ

సిద్దిపేటరూరల్: అంగన్‌వాడీ టీచర్, ఆయాల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సమ్మె చేస్తున్న వారిపై ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడటం సరైంది కాదని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.పద్మ డిమాండ్ చేశారు. సమ్మె మూడవ రోజు బుధవారం బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మి, కళావతి, బాలవ్వ, శాంత, హేమలత, బాల మణి, భాగ్య, తిరుమల, అనిత, అంజమ్మ, శంకరవ్వ, రాధ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి

గుండెపోటుతో మహిళ మృతి

సర్పంచ్ రాజిరెడ్డి బెదిరింపులే కారణమని గ్రామస్తుల రాస్తారోకో



మండలంలోని అంబాజిపేట రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు



దోకు లక్ష్మి(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలం అంబాజిపేట గ్రామానికి చెందిన మహిళా రైతు దోకి లక్ష్మి(58) గుండెపోటుతో మృతి చెందింది. ఆమె మృతికి చిన్నశంకరంపేట సర్పంచ్ రాజిరెడ్డి బెదిరింపులే కారణమని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. బుధవారం చేగుంట-మెదక్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. మృతురాలి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. అంబాజిపేట గ్రామంలోని దుర్గమ్మ గుడి వద్ద మార్వాడి కొనుగోలు చేసిన భూమి పక్కనే తమకు 9 గుంటల భూమి ఉందని, ఈ భూమిని కలుపుకుని పెన్సింగ్ వేస్తే అడ్డుకున్నామని తెలిపారు. ఈ విషయంలో మధ్యవర్తిగా వచ్చిన సర్పంచ్ రాజిరెడ్డి తమను బెదిరించడం మొదలు పెట్టాడని ఆరోపించారు. ఇదే విషయంపై మృతురాలు సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసింది. వీడియో పెట్టిన ఐదు రోజుల్లోనే ఆమె హఠాన్మరణం చెందడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామస్తులు రాస్తారోకో చేస్తున్న ప్రాంతానికి పోలీసులు చేరుకుని వారిని సముదాయించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాజిరెడ్డితో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు.

విద్యుదాఘాతంతో..

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని జానకంపల్లి గ్రామంలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు చికిత్స పొందుతున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని జానకంపల్లి గ్రామానికి చెందిన గుడాల యాదయ్య(65), శంకరయ్య, వెంకటేశం బుధవారం గ్రామశివారులో పొలం వద్ద విద్యుత్ వైర్లకు సంబంధించిన మరమ్మతు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో వారికి కరెంట్ షాక్ రావడంతో యాదయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులను మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మృతుడి భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమర్ తెలిపారు.

మద్యం మానేయమన్నారని..

మద్యం మానేయాలని భార్య మందలించడంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ మండలం జానకంపల్లి గ్రామంలో వెలుగు చూసింది. గ్రామానికి చెందిన దివిటి సత్యనారాయణ(45) కొంత కాలంగా మద్యంకు బానిసయ్యాడు. పని చేయకుండా తాగుడుకు డబ్బులు ఖర్చు చేస్తే ఎలా అని భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన సత్యనారాయణ బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు మెదక్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మెదక్‌రూరల్ ఎస్ఐ అమర్ తెలిపారు.

చికిత్స పొందుతూ..



దేవవ్వ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): విద్యుదాఘాతానికి గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని విశ్వనాథపల్లికి చెందిన గొడుగు దేవవ్వ(53) ఈనెల 5వ తేదీన వ్యవసాయ పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వస్తుండగా కిందికి వేలాడిన 11 కేవీ విద్యుత్ వైర్ తగిలి షాక్‌తో ఆమె పడిపోయింది. వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి..



శ్రీనివాస్ (ఫైల్)

చిన్నకోదూరు(సిద్దిపేట): చేపలు పట్టడానికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృత్యువాతపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని రామంచలో బుధవారం వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన బుర్జికింది శ్రీనివాస్(45) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. ఆదివారం మధ్యాహ్నం పనులకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాస్ రాత్రి వరకు రాలేదు. భార్య సంతోషి వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం చిన్నకోదూరు పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం చెరువులో శ్రీనివాస్ మృతదేహం కనిపించింది. అతను తరచూ చేపలు పట్టడానికి వెళ్తుంటాడని, ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉండవచ్చని స్థానికులు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపారు.

అదుపు తప్పి పొలాల్లో కారు బోల్తా



బోల్తా పడిన కారు

పాపన్నపేట(మెదక్): ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించ బోయి అదుపు తప్పిన కారు బోల్తా పడిన సంఘటన మండల పరిధిలోని అబ్లాపూర్ శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. టేక్మాల్ మండలం అచ్చన్నపల్లికి చెందిన బాల్‌రాజు తన కారులో స్వగ్రామం నుంచి కొత్తపల్లి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించడానికి ప్రయత్నించగా కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాలేదు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుని ఆత్మహత్య



రాము (ఫైల్)

రామాయంపేట(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన ముత్యాల రాము (23) ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగాడు. వెంటనే అతన్ని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుని కుటుంబాన్ని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించి రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మైనంపల్లి సోషల్ సర్వీసెస్ తరపున రూ.ఐదు వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు.

అనారోగ్య సమస్యతో..

తూప్రాన్: అనారోగ్య కారణాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మల్కాపూర్‌లో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు. మల్కాపూర్ గ్రామానికి చెందిన షౌకత్ హుస్సేన్(40) చికెన్ సెంటర్ నడిపిస్తుంటాడు. గతేడాది నుంచి కిడ్నీ సమస్యతో బాధ పడుతున్న హుస్సేన్ మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు చికిత్స

సిద్దిపేటకమాన్: చిన్నకోడూర్ మండలం అనంతసాగర్ రాజీవ్ రహదారిపై మంగళవారం ఆగిఉన్న ఇసుక లారీని క్వాలీస్ ఢీ కొట్టిన సంఘటనలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందగా.. ఏడుగురికి గాయాలైన విషయం తెలిసిందే. ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు విద్యార్థుల మృతదేహాలకు సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విపిన్‌చంద్ర, నాగరాజు మృతదేహాలకు మంగళవారం రాత్రి సిద్దిపేటలో అంత్యక్రియలు నిర్వహించగా, పయ్యావుల గ్రీష్మ మృతదేహానికి వారి స్వస్థలమైన మిరుదొడ్డి మండలం కాసులబాద్ గ్రామంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. తీవ్రంగా గాయపడిన నలుగురు విద్యార్థులు హైదరాబాద్ ఆసుపత్రిలో, స్వల్ప గాయాలైన ముగ్గురు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా గాయపడి హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నమృతకు కన్ను, కాలుకు శస్త్ర చికిత్స నిర్వహించగా, అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చైతన్య ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఐసీయూలో ఉంచారని సమాచారం. అదేవిధంగా హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రవళిక, దేవచందుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

వంటావార్పుతో నిరసన



వంటావార్పు కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు

సిద్దిపేటరూరల్: విద్యాశాఖలోని సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శిబిరం వద్ద వంటావార్పు నిర్వహించి, సామూహిక భోజనాలు చేశారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



గజ్వేల్‌రూరల్: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో గజ్వేల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు సత్తా చాటినట్లు కరాటే బుడోకాన్ అసోసియేసన్ జిల్లా కార్యదర్శి నరేష్ పేర్కొన్నారు. ఈనెల 8, 9, 10, 11 తేదీలలో రాజస్తాన్‌లో జాతీయ స్థాయి కరాటే పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా కుమితె విభాగంలో గజ్వేల్ పట్టణ పాఠశాలలకు చెందిన దీక్షిత(సిల్వర్), నర్సింహ(బ్రౌన్), వైష్ణవి(బ్రౌన్) మెడల్స్‌ను సాధించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

సంగారెడ్డి టౌన్: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు శేషాద్రి డిమాండ్ చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన దీక్షలో భాగంగా బుధవారం మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే వరకు దీక్షలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దత్తు, నరేష్, రాజు ధనలక్ష్మి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు విచ్చేసిన మంత్రి కేటీఆర్‌కు చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, జైపాల్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రషీద్, సాబేర్, జలెందర్, లాడే మల్లేశం, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పనులు

కోహీర్(జహీరాబాద్): కోహీర్ పట్టణంలోని ప్రధాన రహదారి నిర్మాణం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. రూ.1.40 కోట్ల ఆర్‌అండ్‌బీ నిధులతో స్థానిక పోలీస్‌స్టేషన్ చౌరస్తా నుంచి మౌలానా మొహిజోద్దీన్ దర్గా వరకు రోడ్డు నిర్మించనున్నారు. చాలాకాలంగా ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సీసీ రోడ్డు నిర్మాణంతో కష్టాలు తీరనున్నాయని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పనులు పూర్తి చేయాలి

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ హరినందన్ రావు అన్నారు. బుధవారం ఎంపీపీ సమావేశ మందిరంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో గ్రామాల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పనులు, హరిత హారం, చెత్త తొలగింపు, సీసీ రోడ్ల నిర్మాణం, మురుగు కాలువల నిర్మాణం తదితర అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీఓ అంజలిదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన గొర్రెలు అందించాలి

సంగారెడ్డి మున్సిపాలిటీ: గొర్రెల పంపిణీలో భాగంగా ప్రభుత్వం ఇస్తున్న జీవాలు అనారోగ్యం బారిన పడుతున్నాయని, నాణ్యమైనవి అందించాలని కోరుతూ తెలంగాణ గొర్రెల, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఆ మేరకు బుధవారం కలెక్టర్ శరత్, పశుసంవర్ధక శాఖ జేడీ వసంత కుమారిని కలిసి వినతిపత్రం ఇచ్చారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: భార్య అదృశంపై భర్త ఫిర్యాదు చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...తమిళనాడుకు చెందిన మోహన్‌దాస్ హరిచంద్ర ఆతని భార్య సౌందర్యదర్శిని కలిసి ఆగస్టు 15న అమీన్‌పూర్‌లో రెస్టారెంట్ ఏర్పాటు చేసేందుకు వచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 12న ఇంటి నుంచి బయటికు వెళ్లిన సౌందర్యదర్శిని తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త ఆమె కోసం స్థానికంగా ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య అదృశంపై భర్త మోహన్‌దాస్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టికెట్ కేటాయింపుపై పునరాలోచించాలి

పటాన్‌చెరు: పటాన్‌చెరు టికెట్ కేటాయింపుపై పునరాలోచించాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బండ ప్రకాష్‌కు బుధవారం ముదిరాజ్ జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ సుంకరబోయిన మహేష్, ఉమ్మడి మెదక్ జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.



- నిలిచిన ఉత్పత్తులు
- అయోమయంలో యాజమాన్యాలు
- రంగంలోకి అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): పాలకుల, అధికారుల నిర్లక్ష్యంతో నిత్యం సమస్యలు పెరిగిపోతున్నాయి. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో పరిశ్రమలు సైతం నీట మునుగుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం సరైన డ్రైనేజీ, నీటికాలువలు లేకపోవటమే. వరుసగా కురుస్తున్న వర్షాలతో పరిశ్రమల యాజమాన్యాలు తమ ఉత్పత్తులను నిలిపివేస్తున్నాయి. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం పారిశ్రామికవాడలోని వివిధ పరిశ్రమలు నీట మునుగుతున్నాయి. వర్షంనీరు బయటకు వెళ్లేందుకు సరైన కాలువలు లేకపోవటంతో ఉత్పత్తులు నిలిచిపోతున్నాయి. పైభాగం నుంచి కింది భాగం వరకు ఉండాల్సిన కాలువ కాలువలను అక్రమార్కులు కబ్జాలు చేయటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు సైతం ఈ సమస్యను పరిష్కరించకపోవటంతో సమస్య మరింత జటిలంగా మారడంతో ఇటీవల వివిధ పరిశ్రమల ప్రతినిధులు సమస్యలను మంత్రి కేటీఆర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారి ఆదేశాల మేరకు ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, పీసీబీ ఈఈ కుమార్‌పాఠక్, ఇరిగేషన్ శాఖల అధికారులు పారిశ్రామికవాడలో పర్యటించి సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలను ప్రారంభించారు.

సంక్షిప్త వార్తలు

◆ నాకు న్యాయం చేయండి

జిన్నారం(పటాన్‌చెరు): నాపేరుపై ఉన్న భూమిని కొంతమంది ఇతరుల పేర్లమీదకు మార్చారని, నాకు న్యాయం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిష్టాయిపల్లి గ్రామానికి చెందిన మద్దూరి వీరమ్మ పేరు మీద 42/3/5 సర్వేనంబర్‌లో 2.13 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఈ భూమి వీరమ్మ పేరు మీద నుంచి నాగదివ్య పేరు మీదకు మార్చబడి ఉంది. నాకు తెలియకుండా నా భూమి ఇతరుల పేరుమీదకు ఎలా మార్చారని వీరమ్మ ప్రశ్నించారు. విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని బుధవారం ఆర్డీఓ, తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించానని వీరమ్మ తెలిపారు.

◆ సంక్షేమ పథకాల అమలులో వివక్ష తగదు

మనూరు(నారాయణఖేడ్): సంక్షేమ పథకాల అమలులో బీఆర్‌ఎస్ నాయకులు వివక్ష చూపుతున్నారని కాంగ్రెస్ మండల నాయకులు, రాయిపల్లి సర్పంచ్ రాంచందర్, ఎంపీటీసీ రుక్మిణిబాయి దొండిరావు, తుల్జమ్మ, మాజీ సర్పంచ్ డిగంబర్‌రెడ్డి, బ్రహ్మానందారెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నారాయణఖేడ్ నుంచి సిరూర్ వరకు బీటీ రోడ్డు అధ్వానంగా మారిందన్నారు. బీసీ బంధు, దళితబంధు పథకాలు అర్హులైన వారికి అందడంలేదని వాపోయారు. సమావేశంలో నాయకులు నర్సింలు, శివగౌండ, సిద్దయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మతిన్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ సీఐటీయూను గెలిపించండి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఎంఆర్‌ఎఫ్(అంకెనపల్లి) పరిశ్రమలో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికుల సంక్షేమానికి కృషి చేసే సీఐటీయూను భారీ మెజారిటీతో గెలిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం పిలుపునిచ్చారు. కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా బుధవారం పరిశ్రమ ఎదుట గెట్ మీటింగ్ నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, నాయకులు నర్సింలు,అశోక్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

◆ వాటా కొనేందుకు ముందుకు వచ్చిన రైతులు

జహీరాబాద్ టౌన్: రంజోల్ బాబానగర్‌కు చెందిన పలువురు రైతులు ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో వాటాను కొనేందుకు ముందుకు వచ్చారు. దీంతో సామాజిక ఉద్యమకారుడు, రైతు నాయకుడు ఢిల్లీ వసంత్ బుధవారం రైతులను సన్మానించారు.

◆ ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన

కోహీర్(జహీరాబాద్): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంపై బుధవారం కోహీర్ ప్రభుత్వ ఆస్పత్రిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమం అమలుతో ప్రజలకు కలిగే వైద్యసదుపాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య సేవల కోఆర్డినేటర్ సంగారెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

◆ క్రీడలు ప్రారంభం

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను నిరూపించుకొనేందుకు క్రీడలు దోహదపడుతాయని ఎంఈఓ మారుతి రాథోడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని హద్నూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో మండల స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

◆ కాంగ్రెస్ పథకాలు వివరిస్తున్నాం

పటాన్‌చెరు టౌన్: గెలుపే దిశగా గడపగడపకు కాంగ్రెస్ పథకాలు వివరిస్తూ వస్తున్నామని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి అన్నారు. ఏఐసీసీ లోక్‌సభ అబ్జర్వర్ రజీనాతో కలసి డివిజన్ బండ్లగూడలోని నేతాజీనగర్ కాలనీలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు.

నారాయణఖేడ్‌లో...

నారాయణఖేడ్: మండలంలో మాద్వార్, లింగనాయక్‌పల్లి, హన్మంత్‌రావుపేట్ తదితర గ్రామాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాహెర్ అలీ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ శారు.

దిష్టిబొమ్మల దహనం

సంగారెడ్డి అర్బన్: ఏడు శాతంలేని రెడ్డి, వెలమ, కమ్మ అగ్రకులాలకు ఏడు పార్టీలేమిటని, ఆ పార్టీల నాయకత్వాన్ని బీసీ ఎస్సీ ఎస్టీ సబ్బండ కులాలకు అప్పగించాలని ధర్మ సమాజ్ పార్టీ స్టేట్ సెక్రటరీ లక్ష్మణ్ మహరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని న్యూ బస్టాండ్ వద్ద రోడ్డుపై చేపట్టిన ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 93శాతం ప్రజలు బీసీ, ఎస్సీ, ఎస్టీలుండగా ఏడు శాతం లేని అగ్రకులాలు బీఆర్‌ఎస్ బీజేపీ, కాంగ్రెస్, టీజేఎస్, సీసీఐ, సీపీఎం, వైఎస్ఆర్‌టీపీలకు నాయకత్వం వహించడమేమిటని ప్రశ్నించారు. అనంతరం బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు శ్రీనివాస్, జాహిరాబాద్ ఇన్‌చార్జి మహేందర్, సదాశివపేట ఇన్‌చార్జి దుర్గారాజ్, అనిల్, బాలరాజ్ పాల్గొన్నారు.